# పాత సమస్య కొత్త పరిష్కారం

కథ



## ఆచార్య సి. ఆనందరామం

*"బెండకాయ వేపుడు బాగుంది"*

*"మరికాస్త వడ్డించనా? వంకాయ బజ్జీ కూడా వడ్డించుకోండి-"*

*"పెరుగు మీద మీగడ చిక్కగా తోడుకుంది"*

*"ఇలా తోడుకుంటే నానీకి ఇష్టం"*

చటుక్కున అనేసి నాలుక కరుచుకుంది వర్ధని. ఏదో తప్పు చేసిన దానిలా వెలవెల పోతూ చూసింది. పెరుగు వడ్డించుకోబోతున్న సూర్యప్రకాష్ పెరుగు గిన్నె పక్కన పెట్టేసాడు- ఎంగిలి చేత్తోనే కుర్చీ వెనక్కి జార్లగిలబడ్డాడు- మనసులో బాధ కళ్ళలోంచి బయటికి పొంగకుండా ఉండటానికే అన్నట్లు, భారంగా కళ్ళు మూసుకున్నాడు.

"పెరుగు తినండి" అనలేకపోయింది వర్ధని- ఆమెకీ గొంతు పూడుకొచ్చింది. నోరు విప్పితే, తనను తాను నిభా యించుకోలేనేమోనని నోరు విప్పలేదు. ఆవిడ చెయ్యి కంచంలోనే ఉంది. కానీ, చెయ్యి మాత్రం నోటి దగ్గరికి పోవటంలేదు. పెరుగు వడ్డించుకోకుండానే, "మనిషికి ఏం కావాలి? వర్ధనీ?" అన్నాడాయన.

ఆ ప్రశ్న ఎందుకడుగుతున్నాడో, తెలిసి మాట్లాడలేదు వర్ధని- ఇద్దరూ చదువుకున్న వాళ్ళు- ఒకరినొకరు అర్థం చేసుకున్నవాళ్ళు. ఎవరు ఏ మాట ఎందుకు మాట్లాడుతున్నారో, రెండోవారికి తెలిసిపోతుంది. ఆయన మనసు మరిపించటానికి "సాయంత్రం ఏదైనా సినిమాకి వెళ్దామా?" అంది-

"సినిమాలలో కన్న సంతానం తల్లిదండ్రులని నిర్లక్ష్యం చేసిన కథలు చూసినపుడు మనసు కదిలినా, అవన్నీ ఎవరివో కథలులా తోచేవి. ఎక్కడో, ఎవరికో, దూరంగా జరుగుతున్న కథలు- తీరా మనదాకా వచ్చేసరికి, ఈ పుండు ఇంత దారుణమైన క్షోభ కలిగిస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు-"

ఆవిడ మాట్లాడలేదు- జీవితంలో ఎన్నో ఢక్కామొక్కీలనెదుర్కొంది. పై ఆఫీసర్లతో హోరాహోరీ పోరాడి న్యాయంగా తనకు రావలసిన ప్రమోషన్లను దక్కించుకుంది. కొడుకులు సరిగ్గా చదువుకోక అల్లరిచేస్తే, వాళ్ళకి నయభయాల నచ్చజెప్పి, ప్రయోజకులయ్యేలా చేసింది. కట్నంగా ఏమీ తీసుకోనని చెప్పి, బేరసారాలు లేకుండా చదువూ, చక్కదనమూ ఉన్న పిల్లల్ని కోడళ్ళుగా తెచ్చుకుంది. కూతురికి కూడా కట్నంగా ఏమీ ఇయ్యనని కచ్చితంగా చెప్పి, వంటినిండా బంగారం, ఒక ఇల్లూ కానుకగా కూతుర్ని కోరుకున్న వాడికిచ్చి పెళ్ళి చేసింది. ఇవన్నీ ధైర్యంగా ఎదుర్కొన్న వర్ధని ఇప్పుడు

ఆరుపదులు దాటాక, ఈ సమస్యను ఎదుర్కోలేక పోతోంది.

వర్ధని ముఖం చూస్తూ సూర్యప్రకాష్ మళ్ళీ "చెప్పూ, మనిషికి ఏం కావాలి? మంచి కూర, పచ్చడి, పులుసు, స్వీటూ హాటూతో భోజనమా?"

"కాదు-"

"పోనీ బట్టలా? మేడలా? కార్లా? షికార్లా?"

ఫక్కున నవ్వింది వర్ధని వర్షాకాలపు మెరుపులా...

"ఇవన్నీ ఒక వయసులో కావాలనిపిస్తుందేమో! వృద్ధాప్యంలో మాత్రం ఇవన్నీ ఉన్నా ఆనందం రాదు-"

"పోనీ అందాన్ని వరంగా ఇస్తే?"

"ఇప్పుడు నన్ను అమాంతం అప్సరసలా మార్చేసినా సుఖంగా ఉండలేనేమో!"

పోనీ, మీ సంగతి చెప్పండి- రెండో పెళ్ళి చేసుకుంటారా?" అంది-

"కర్మ! ఒక పెళ్ళితోనే ఇంత ఛస్తున్నాను. ఇంక రెండో పెళ్ళి కూడానా?"

తిరిగి తిరిగి సంభాషణ మొదటి కొచ్చినందుకు వర్ధని బాధపడింది. ఆయన పెరుగు వేసుకోకుండానే, చెయ్యి కడిగేసుకున్నాడు. వర్ధని భోజనం మధ్యలో లేచిపోయింది. రుచికరమయిన వంటకాలన్నీ ఒక దానిని మరొకటి తెల్లబోయి చూసుకున్నాయి.

వర్ధని ఆలోచనలో పడింది.

"మనిషికి ఏం కావాలి?"

"నా వాళ్ళు అనుకునే ఆత్మీయుల మధ్య ఉండటం-"

"- బహుశః ప్రతి వ్యక్తీ ఇదే కోరుకుంటాడేమో! ముఖ్యంగా వృద్ధాప్యంలో కొడుకులతో, కోడళ్ళతో, మనవలతో కలిసి ఉండాలని కోరుకుంటారు.

అత్తా- కోడళ్ళ సమస్య ఈనాటిది కాదు. కారణాలు ఏవైనా, వారిద్దరూ, విభిన్న వర్గాలకు చెందినవ్యక్తుల్లా సంఘర్షించుకుంటారు.

ఈ విషయం వర్ధని ఆలోచించకపోలేదు. సాధారణంగా సమస్యలు డబ్బు దగ్గర తలెత్తుతాయి. అందరికీ ఎవరి సంపాదన వారికుంది. తనకీ, భర్తకీ కూడా పెన్షన్ వస్తుంది. ఒకరి మీద మరొకరు ఆధారపడ వలసిన

అవసరం లేదు. అందుచేత సమస్యలు రావనుకొంది.

ఒక నెల ఒక కొడుకు దగ్గరా, మరో నెల మరో కొడుకు దగ్గరా, ఇలా ఇద్దరు కొడుకుల దగ్గర ఉంటూ, తమ పోషణ ఖర్చులు ఏ కొడుకు దగ్గర ఉన్నప్పుడు ఆకొడుక్కి ఇయ్యాలని నిర్ణయించుకున్నారు దంపతులు. సహజంగానే వృద్ధ దంపతులకి మనవలంటే ప్రేమ. నానిగాడు, చిట్టితల్లి, బుజ్జిపండు, చిన్న, కన్న- వీళ్ళందరూ ఎప్పుడూ, నాన్నమ్మ, తాతయ్యలతో ఉండేవారు.

అయితే, సమస్యలు అనుకోని వైపునుంచి వచ్చాయి. పెద్ద కొడుకుకి టూర్ ప్రోగ్రామ్స్ ఉంటాయి. అతడు టూర్‌కి వెళ్ళినప్పుడల్లా- పెద్దకోడలు ఇంట్లో ఆకుకూర పప్పు వండి, చారు పెట్టేది. పిల్లలకి బయటినుంచి చికెన్ బిరియానీ లాంటివి తెప్పించేది. పెద్దవాళ్ళు మొదటినుంచీ శాకాహారానికి అలవాటుపడ్డవాళ్ళు. వర్ధని కోడలితో "మీ మావగారు పప్పూ, చారుతో తినలేరమ్మా! ఆయనకి కూర కావాలి!" అని చెప్పింది.

"కావాలంటే వండుకోండి! ఇక్కడ మీకు కావలసినవన్నీ వండిపెట్టడానికి ఎవరికీ తీరిక లేదు" కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్లు సమాధానం చెప్పింది.

వర్ధని నిర్ఘాంతపోయి భర్తకి చెప్తే "అవును నిజమే! నీ భర్తకోసం నువ్వే వండుకోవాలి మరి!" అన్నాడు లోపలి బాధ కనపడనీయకుండా.

"మనిద్దరికీ ఎలా వండుతాను?"

"పోనీ అందరికీ వండు-"


ఉసూరుమన్న వర్ధని అలాగే చేసింది. కోడలు సంతోషించలేదు. "డబ్బాలో బోలెడు నూనె ఉండాలి. ఏమయిపోయింది? చింతపండుతో పులిహోర ఏమైనా చేశారా? బొత్తిగా ఖాళీ అయింది. అయ్యో! ఈ పెరుగు పిల్లలకోసం తోడు పెట్టాను. ఎవరు పోసుకున్నారు?" అంటూ ముఖం మీదే సాధింపులు ప్రారంభించింది.

"ఇదేవిటండీ! ఇంత బతుకు బతికాక, కోడలు దొంగతనం అంటగడ్తోందీ? నేను ఇక్కడ ఉండలేను-" అంది వర్ధని ఏడుస్తూ.

"సరే! చిన్నోడి దగ్గరకి వెళ్దాం పద!" అన్నాడు సూర్యప్రకాష్.

వర్ధని కన్నీళ్ళతో కోడలికి "వెళ్ళిస్తాను" అని చెప్తే, ఆమె "నిండింట్లో ఏడవకండి!" అని కసిరింది.

చిన్న కోడలి దగ్గర మరో సమస్య ఎదురయింది ఆమెకి. ఉద్యోగస్థురాలిగా చెలామణి కావాలని బోలెడు సరదా! అయితే సవ్యమైన ఉద్యోగం కాని, అందుకు కావాల్సిన అర్హతలు కాని ఆమెకి లేవు. అయినా- ఏదో ఉద్యోగం సృష్టించుకొని దానికి పెద్ద పెద్ద పేర్లు పెట్టి, గొప్పగా ప్రొజెక్ట్ చేసి "అయామ్



ఒక నెల ఒక కొడుకు దగ్గరా, మరో నెల మరో కొడుకు దగ్గరా, ఇలా ఇద్దరు కొడుకుల దగ్గర ఉంటూ, తమ పోషణ ఖర్చులు ఏ కొడుకు దగ్గర ఉన్నప్పుడు ఆ కొడుక్కి ఇయ్యాలని నిర్ణయించుకున్నారు దంపతులు. సహజంగానే వృద్ధ దంపతులకి మనవలంటే ప్రేమ. నానిగాడు, చిట్టితల్లి, బుజ్జి పండు, చిన్న, కన్న- వీళ్ళందరూ ఎప్పుడూ, నాన్నమ్మ, తాతయ్యలతో ఉండేవారు.

వెరీ బిజీ" అని ఇంట్లోంచి వెళ్ళిపోతూ ఉంటుంది. "వెరీ బిజీ" అనేది ఆమె ఊత పదం"గా మారిపోయింది. పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఇంట్లో ఉండాలి. లేదా బేబి క్రెష్‌లో వేసేది. వర్ధని ఇదంతా చూసి "మేమూ ఉద్యోగాలు చేసిన వాళ్ళమే కదా! ఇల్లు పట్టించుకోకుండా ఉదయం ఎనిమిది నుంచి, సాయంత్రం ఎనిమిద వరకూ ఉద్యోగమేనా?" అంది.

"దయచేసి నా విషయాల్లో కల్పించుకోకండి. ఈ ఇంటి కోసమూ, పిల్లల కోసమూ నేనెంత త్యాగం చేస్తున్నానో, మీకు అర్థం కాదు. మీరు నన్ను ఏమైనా అన్నారంటే ఈ ఇల్లు ఒదిలి వెళ్ళిపోతాను జాగ్రత్త!" అంది. హడలిపోయింది వర్ధని.

"బాబోయ్! పెద్దకోడలే మేలు! దొంగతనం అంటగట్టినా లేచిపోతానని బెదిరించలేదు" అంది భర్తతో...

"లాభం లేదు! మనం వేరే పోదాం పద! మన సంపాదన మనకి ఉంది. నాకు నువ్వూ, నీకు నేనూ తోడు-"అన్నాడు సూర్యప్రకాష్-

ఇద్దరూ వేరుగా వచ్చేసారు. కానీ వారం రోజులు కూడా ఉండలేకపోయారు. కూరలు, పిండి వంటలు, సినిమాలు- ఏవీ మనవలను మరిపించలేకపోయాయి. ఏది తినబోతున్నా మనవడో, మనవరాలో గుర్తుకొచ్చేవారు.

"ఎదుటి వ్యక్తుల్ని మనకు కావలసినట్లు మార్చగలిగే శక్తి మనకి లేదు. అవునా?" అన్నాడు సూర్యప్రకాష్.

"అవునూ..."

"కానీ మనం మన మనసు మార్చుకోగలం! మనకి ఎలా కావాలనుకుంటే, అలా ఉండగలం. అవునా?"

"నిజమే!"

"పద! మన పిల్లల దగ్గరకీ, మనవల దగ్గరికీ పోదాం!" అన్నాడు సూర్యప్రకాష్- వర్ధని ముఖం ఆనందంతో వెలిగింది.

** ** **

వంటింట్లోకి వెళ్ళబోతున్న అత్తగారితో "నూనె చాలా తక్కువగాఉంది"అంది కోడలు.

"నీ వస్తువుల విషయం నువ్వు చూసుకో అమ్మా! మా సామాన్లు మేం తెచ్చుకుని మా వంట మేం వండుకుంటాం! నీ వస్తువులు ముట్టుకోను" అంది వర్ధని. తెల్లబోయింది కోడలు. అత్తగారిని ఇంట్లోంచి ఎలా పంపెయ్యాలో తోచలేదు. మనవలంతా, తాతయ్యనీ, నాయనమ్మనీ చూసి ఎంతో ఆనందించారు.

** ** **

"నేను బిజీ!" అంది చిన్న కోడలు.

"నీ ఇష్టం అమ్మా! కానీ పిల్లల విషయంలో మామీద భరోసా పెట్టుకోకు. మా వంట మేం వండుకు తింటాం!మాకు ఓపిక ఉన్నంతసేపు పిల్లలతో ఆడుకుంటాం. ఏదైనా పని ఉంటే బయటికి వెళ్తాం. నీ జాగ్రత్తలు నువ్వు చూసుకో! మా గురించి నీ పని పాడు చేసుకోకు" శాంతంగా చెప్పింది వర్ధని.

నిర్ఘాంతపోయింది చిన్న కోడలు.

కొడుకులు ఎప్పటిలాగే తల్లిదండ్రుల్ని గౌరవంగా పలకరించారు. మనవలు సంబరంగా కేరింతలు కొట్టారు. కూరలూ, పెరుగులూ లేకపోయినా ఆ వృద్ధ దంపతుల హృదయాలు సంతృప్తితో పరవశించాయి. ●